క్లుప్తంగా

చర్చి ప్రారంభం



వేళాంగిణీ మాత దేవాలయాన్ని ప్రారంభిస్తున్న బిషప్ విజయ్‌కుమార్

వీరఘట్టం: పట్టణంలోని రెల్లివీధిలో నూతనంగా నిర్మించిన వేలాంగణీ మాత చర్చిని మేత్రాసనం బిషప్ రాయరాల విజయకుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దివ్య పూజలో బిషప్ విజయ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత వీరఘట్టం కాలేజ్ సెంటర్ నుంచి బిషప్‌ను క్రైస్తవ భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపుగా తీసుకువచ్చారు. పూజానంతరం గ్రామస్తులందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫాదర్ ధనరాజ్, రెల్లివీధి యువత, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కళావతి

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు బైజూస్ ట్యాబ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎ.కళావతి మాట్లాడుతూ, విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని బాగాచదువు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బృందావతి, హెచ్‌ఎం లిల్లీరాణి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ కనబరచాలి



క్రీడా దుస్తులతో విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో మరింత ప్రతిభ కనబరచాలని భాసూరు సర్పంచ్ ఎస్.మల్లేశ్వరమ్మ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ముంజేటి మన్మధరావు సమకూర్చిన క్రీడా దుస్తులు, కిట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వీవీ రాజు మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర స్థాయి అండర్ – 14 కబడ్డీ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు బంగారు పతకం సాధించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.గురువినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సిద్ధం



రావుపల్లిలో సుందరంగా తీర్చిదిద్దిన క్రీస్తు మందిరం

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న క్రైస్తవ మందిరాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. వివిధ రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గొట్టివలస, గరుగుబిల్లి, పెద్దూరు, శివ్వాం, రావుపల్లి, దళాయివలస, చిలకాం, రావివలస, చినగుడబ, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ కాంతులతో మిరిమిట్లుగొలుపుతున్నాయి. ఏసుక్రీస్తు జయంతి సందర్భంగా ఈనెల 25న క్రైస్తవులంతా క్రిస్మస్ వేడుకల ను ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

గురుకులం విద్యార్థుల ప్రతిభ

కొమరాడ: గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలో జోన్ స్థాయిలో అండర్-17 క్రీడా పోటీల్లో కొమరాడ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు తెలిపారు. ఈ నెల 20 నుంచి 22 వరకు శ్రీకాకుళం జిల్లా పెద్దమడిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో పాఠశాలకు చెందిన కె.శ్రీను అత్యధిక పతకాలు గెలుచుకున్నట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం అభినందించారు. వారంతా ఈ నెల 28 నుంచి పాచిపెంట మండలం పి.కోనవలసలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఏరియా ఆస్పత్రిలో బెడ్స్ ఏర్పాటు

సీతంపేట: కరోనాను ఎదుర్కోవడానికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో ముందస్తుగా కోవిడ్ బెడ్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 5 బెడ్లతో పాటు వెంటిలేటర్, ఆక్సిజన్ సప్లై కాన్సంటేటర్, మానిటర్ వంటివి అందుబాటులో ఉంచారు. ఏర్పాటు చేసిన పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్సైను కలిసిన సర్పంచ్‌లు

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.శివప్రసాద్‌ను మండలానికి చెందిన సర్పంచ్‌లు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు బి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో ఎస్సైకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలందిద్దామని ఎస్సై అన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి...



వీరఘట్టం: భక్తులచే పూజలందుకున్న సత్యనారాయణస్వామి

శ్రీ మహా విష్ణువు గరుడ వాహన రూఢుడై మూడు కోట్ల మంది దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిచ్చిన పర్వదినం ముక్కోటి ఏకాదశి . ఈ రోజున ఆలయాల్లో వైకుంఠ ద్వారాలు (ఉత్తర ద్వారాలు) తెరుచుకుంటాయి. ఈ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుంటే ముక్తి లభిస్తుందనేది భక్తుల విశ్వాసం. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు శనివారం వేకువజాము నుంచే బారులు తీరారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాయి.

– పాలకొండ నెట్‌వర్క్



సీతంపేట: వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు కళావతి, జోగులు



పాలకొండ రూరల్: వేంకటేశ్వర ఆలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తున్న స్వామి

రాష్ట్రంలో సుస్థిర పాలన

- ఎమ్మెల్యే కళావతి
- కంబరలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన గురుతర బాధ్యత తమపై ఉందన్నారు. మండలంలోని కంబరలో శనివారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలతో రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాల వారినీ మోసం చేసిందని ఆరోపించారు. అదే జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారని కొనియాడారు. మేనిఫెస్టోలో పొందుపరచని ఎన్నో పథకాలను కూడా ప్రజలకు అందించారని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజు రోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సంక్షేమం కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, గంట వెంకటరావు, భోగి మణి, ఆబోతుల సంఘంనాయుడు, జి.సాగర్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విక్రాంత్ జన్మదిన వేడుకలు



విక్రాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, రాజశేఖరం, తదితరులు

పాలకొండ: శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ పుట్టిన రోజు వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు విక్రాంత్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఆర్డీఓ లావణ్యతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం విక్రాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. విక్రాంత్ కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



కురుపాం: మొండెంఖల్ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



జియ్యమ్మవలస: కన్నపుదొరవలసలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొరవలస గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీవంకరావు ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని, ప్రజలంతా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు మరడాన కిశోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొండెంఖల్‌లో..

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామంలో స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీ విద్యారాణి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



బాధితుడికి లక్ష రూపాయల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: సీతంపేట మండలం కోడిశ గ్రామానికి చెందిన నిమ్మక కృష్ణ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో వైద్య చికిత్సల కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వండవ క్యాంప్ కార్యాలయంలో శనివారం అందజేశారు. కృష్ణ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందేలా కృషి చేశారు. ఈ సందర్భంగా బాధితుడు కృష్ణ మాట్లాడుతూ, ఎమ్మెల్యే కళావతి, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుండంగి సింహాచలం, బిడ్డిక రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించండి

భామిని: జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై నిర్వహించనున్న సామాజిక తనిఖీకి ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీఓ జె.ఉమామేశ్వరి కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2022 – 23లో చేపట్టిన ఉపాధి పనుల రికార్డులు సోషల్ ఆడిట్ బృందానికి అప్పగించాలన్నారు. పంచాయితీ వారీగా ఉపాధి మస్టర్లు, రికార్డుల కాపీలను వారికి ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎస్ఆర్‌పీ తిరుపతిరావు, ఈసీ డోల రమణమూర్తి, ఏపీఓ ఈ.తులసీదాస్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

జియ్యమ్మవలస: మండలంలోని టీకే జమ్ము నుంచి పల్లపుసిరిపి, నడిమిసిరిపి గ్రామాలకు రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం భూమిపూజ చేశారు. టీకే జమ్ము నుంచి పల్లపుసిరిపి కిలోమీటరు రహదారి నిర్మాణానికి రూ.57 లక్షలు, పల్లపుసిరిపి నుంచి నడిమిసిరిపి వరకు కిలోమీటరు రోడ్డు నిర్మాణానికి రూ.64 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

ధాన్యం కొనుగోలులో దందా..

- దళారులకు సహకరిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది?



వెంకమ్మచెరువు సమీపంలో ఓ వ్యాపారస్తుడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీకి ఎక్కిస్తున్న దృశ్యం

వీరఘట్టం: ధాన్యం కొనుగోలు విషయంలో కొంత మంది ఆర్‌బీకే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. దళారులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజులుగా ఓ వ్యాపారి కొంతమంది రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి తణుకు పట్టణంలోని రైస్ మిల్లుకు పంపిస్తున్నాడు. అయితే ఈ ధాన్యం మాత్రం ఆర్‌బీకే సిబ్బంది కొనుగోలు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదవుతుండడం విశేషం. లారీ వివరాలతో పాటు రైతుల పాస్ పుస్తకాలతో వ్యాపారస్తుడు ఆర్‌బీకే సెంటర్‌కు వెళితే అక్కడ ఉన్న డీఈఓలు, టీఏలు ట్రక్ షీట్ జనరేట్ చేస్తున్నారు. అదే ఒక సామాన్య రైతు వెళితే మాత్రం నెట్‌వర్క్ పని చేయడం లేదు...ట్రక్‌షీట్ జనరేట్ కావడం లేదు... రెండు రోజులు ఆగండి అని సమాధానం ఇస్తూ దాటవేస్తున్నారు. దీంతో రైతులు గత్యంతరం లేక వ్యాపారస్తుడికే తక్కువ ధరకు ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారంపై మండల వ్యవసాయశాఖ అధికారి సౌజన్య వద్ద ప్రస్తావించగా కొంతమంది డీఈఓలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ధాన్యం కొనుగోలులో చేతివాటం చూపిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే నేరుగా తనకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

26 నుంచి ఉపాధి గ్రామసభలు

గుమ్మలక్ష్మీపురం: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలపై గ్రామ పంచాయతీ స్థాయిలో ఈనెల 26 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ శివరామక్రిష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 26న చాపరాయి బిన్నిడి, నెల్లికిక్కువ, ఇరిడి, గుమ్మలక్ష్మీపురం పంచాయతీల్లో, 27న బాలేసు, రాయగడ జమ్ము పంచాయతీల్లో, 28న దుడ్డుఖల్లులో, 29న వనకాబడి, 30న తాడికొండ, జర్న, చినగీసాడలలో, 2024 జనవరి 2న బీరుపాడులో, 3న లక్కగూడ, గొయిపాకలలో, 4న ఎల్విన్‌పేట, కేదారిపురం, దుమ్మంగిలలో, 5న చెముడుగూడ, కొండవాడలలో, 6న లుంబేసులో, 7న పి.ఆమిటిలో, 8న వంగర,మండ, నోంద్రుకోనలలో, 9న పెదఖర్జ, రెల్లలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పక్కాగా 'ఆడుదాం ఆంధ్రా'



మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్, ఎంపీడీఓ, తదితరులు

- నగర కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: క్రీడా ప్రతిష్ట ఇనుమడింపజేసేలా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను పక్కాగా నిర్వహిద్దామని నగర కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టణ పరిధిలోని తొమ్మిది సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో సమావేశమయ్యారు. నియోజకవర్గ, మండల క్రీడా నిర్వాహకులు వి.పుష్పనాథం, ఆర్.రాములు క్రీడల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, తదితర క్రీడాంశాలపై పోటీలు నిర్వహిస్తామని, దాదాపు 150 జట్లు తలపడనున్నాయని చెప్పారు. ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక యాలంకూడి నుంచి సీతంపేట రహదారిలో 5 కిలోమీటర్ల పరుగు కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డొంక త్రినాథులు, డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ శ్యాంబాబు, మండల విద్యాశాఖాధికారి కె.సోంబాబు, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన



బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ జయరాం

గుమ్మలక్ష్మీపురం: బ్యాంకులు అందించే సేవలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేదారిపురం ఎస్‌బీఐ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ కె.జయరాం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొని బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సేవింగ్ అకౌంట్స్, లోన్స్ ఎలిజిబిలిటీ, మనీ ట్రాన్స్‌ఫర్, బ్యాంకు ఇన్సూరెన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకులు వి.కల్పన, ఎన్ఎస్ఎస్ పీఓలు డి.రామయ్య, బి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనం

గరుగుబిల్లి: విజయవాడ ఇంద్రకీలాద్రి నుంచి విచ్చేసిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామివారి ధర్మప్రచార రథం శనివారం మండలంలోని తోటపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆయలానికి చేరుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దుర్గామల్లేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



గరుగుబిల్లిలో డ్రైనేజీల నిర్మాణం

పాలకొండ రూరల్: మండలంలో వివిధ అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నారు. జంపరకోట పంచాయతీ పరిధి వంతవాడ వై జంక్షన్ నుంచి బర్న గిరిజన గ్రామం వరకు సీసీ రహదారి పనులకు సర్పంచ్ ఆరిక వెంకటేష్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యురాలు నిమ్మక దుర్గమ్మ, నారాయణరావు తదితరులున్నారు. లుంబూరులో రూ. 12 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు.. గరుగుబిల్లిలో రూ. 8 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. యరకారాయపురంలో వీధి కాలువల పనులను సర్పంచ్ బి.పరిమళ ప్రారంభించారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

కొమరాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు అన్నారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తోందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గంటా స్వర్ణప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్చికి మైక్‌సెట్ వితరణ



చర్చికి అందజేసిన మైక్‌సెట్‌తో కళాసాగర్, అంబేడ్కర్ యూత్ సభ్యులు

పాలకొండ రూరల్: మండలంలోని చినమంగళాపురం గ్రామంలో ఉన్న పునీత పౌలు గారి ఆర్‌సీఎం చర్చికి అదే గ్రామానికి చెందిన కంబాల కళాసాగర్ రూ.80 వేల విలువైన మైక్‌సెట్ శనివారం వితరణ చేశారు. ఆయన తండ్రి కంబాల విజయరత్నం జ్ఞాపకార్థం వీటిని అందించినట్లు ఆయన తెలిపారు. చర్చి అభివృద్ధికి గ్రామస్తులు సహకరిస్తుండడం ఆనందంగా ఉందని, మరింతమంది సహాయం అందించేందుకు ముందుకురావాలని గ్రామపెద్దలు కోరారు. అంబేద్కర్ యూత్ సభ్యులు కంబాల నితీష్, కంబాల శేఖర్, డొంక శివ, పక్కి శివ, గ్రామపెద్దలు పక్కి జోనేష్, డొంక దాసు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కురుపాం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ శనివారం కురుపాం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మక జయరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని, ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో నాయకులు నడుకూరు ధూళికేశ్వరరావు, ఆగూరు వైకంఠరావు, గండి మురళి, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి

భామిని: మండలంలో గీతా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బాలేరులో రామకృష్ణ భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన గీతా జయంతి వేడుకలలో సింహపురి యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ రొక్కం సుదర్శనరావు, విజయలక్ష్మి దంపతులు పాల్గొని హోమాధికాలు చేపట్టారు. నీటి సంఘ మాజీ అధ్యక్షుడు రొక్కం రామారావు ఆధ్వర్యంలో విశ్వరూపం చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. సోలికిరిలో హరేరామ దండు ఆధ్వర్యంలో గీతాపారాయణం చేశారు. అలాగే బత్తిలి, దిమ్మిడిజోల, తదితర గ్రామాల్లోనూ గీతాజయంతి పారాయణం చేశారు.